


పాండురంగం కూతురు చురుకైనది. దానికి ప్రతి క్షణం కొత్తదనం కావాలి. ఏ ఆట వస్తువుతో అయినా అది అయిదు నిముషాలకు మించి ఆడేది కాదు.

ఆరంభంలో పాండురంగం కూతురికి కొత్త బొమ్మలు తరచుగా కొనేవాడు. కానీ అలా కలకాలం కొనసాగించడానికతడు కోటీశ్వరుడు కాదు.

ఆపద్ధర్మంగా పాండురంగం బుర్రకు పదును పెట్టాడు.

పాండురంగం రచయిత. సంపాదకులు. ఆంగ్ల సాహిత్యంలోని కల్పనా సాహిత్యాన్ని క్షుణ్ణంగా చదివాడు. తలచుకుంటే అతడికి ఉపాయాలకు కొదవా?

ఒకసారి పాండురంగం కూతురికి కోతిబొమ్మ కొన్నాడు. ఎప్పటిలాగే అది దానితో అయిదు నిముషాలు ఆడింది.

అయిదు నిముషాల టైము విషయంలో అదెంత కచ్చితమంటే పాండురంగం భార్య కుక్కర్ స్టవ్ మీదపెట్టి కూతురికి బొమ్మిస్తుంది. దాని ఆట అయిపోగానే కుక్కరు కట్టేస్తుంది. ఆ విధంగా ఆమెకది టైమరులా కూడా వుపయోగపడుతోంది. కుక్కరింకో అయిదు నిముషాలుండాలనుకుంటే పిల్ల దానికింకో బొమ్మ ...

ఆ రోజు చలపతికి సన్మానం

చలపతి రచయిత.

అతడు మామూలు రచయిత కాదు. తెలుగు పాఠకులనో ఊపు ఊపి తెలుగు సాహిత్యాన్నో మలుపు తిప్పిన అసామాన్యుడు.

చాలా మంది అతణ్ణి యుగకర్త అంటారు.

కిట్టని వాళ్ళు, ఛాందసులు అతడి రచనలు చౌకబారుగా వున్నాయంటారు. కానీ ఎక్కువ మంది అతడి రచనల్లో సత్తా వున్నదని ఒప్పుకుంటారు. ఆ ఒప్పుకున్న వాళ్ళలో కొందరు చలపతి గొప్పతనమేమీ లేదనీ అదంతా పాండురంగం ప్రభావమేననీ అంటారు.

పాండురంగం సంచలన పత్రికా సంపాదకుడు. అతడికి సాహిత్యపు లోతులపైన, విలువలపైన నమ్మకం లేదంటారు.

పదుగురాడు మాట పాటియై ధర చెల్లు అన్న ఆర్యోక్తి నాధారం చేసుకుని అతడు రచనల గురించీ, రచయితల గురించీ విపరీతమైన ప్రచారం చేసి పత్రికకు ప్రాచుర్యం సంపాదించాలనుకున్నాడని అనేకుల ఉవాచ.

ప్రచారపు ప్రయోజనాలను ప్రచారం చేసిన ఘనత గోబెల్‌కు దక్కుతుంది. ఆయన హిట్లర్‌కు అనుయాయుడు. ఒక అబద్ధాన్ని అందంగానూ, అదే పనిగానూ చెబితే అదే నిజమై కూర్చుంటుందని ఋజువు చేశాడాయన.

బ్రాహ్మణుడు, నలుగురు దొంగల కథలో మేకను ప్రచారంలో కుక్కగా భ్రమింపచేయడం పంచతంత్రంలో వివరించబడింది.

పాండురంగానికివన్నీ తెలిసినా సాహిత్యంలో ఇలాంటి ప్రయోగం చేయాలని అతడికి కూతురు పుట్టేకనే తెలిసింది.

కోతి బొమ్మతో అయితే అయిదు నిముషాలా దగానే పాండురంగం బొమ్మను తీసుకుని దాని మీద గుడ్డ కప్పి మంత్రం చదివి, ''ఇప్పుడిది సింహంగా మారిపోయింది'' అన్నాడు.

సింహాన్ని చూస్తే లేడికి భయం. అందుకని లేడి బొమ్మ భయపడుతోంది. కోతి కిచ కిచమంటుంది. పాండురంగం కోతిబొమ్మను ముఖం దగ్గర పెట్టుకుని సింహగర్జన చేశాడు. కోతి గంతులేస్తుంది. పాండురంగం బొమ్మను హుందాగా నడిపించాడు. కోతి చెట్ల మీద వుంటుంది. పాండురంగం బొమ్మను అగ్గిపెట్లతో చేసిన గుహలోకి నడిపించాడు.

కోతి సింహంగా మారిపోయిందని పాండురంగం భార్య, పనిమనిషి, బట్టలకు వచ్చిన చాకలి, అతణ్ణి కాకాపట్టడానికి వచ్చిన రచయితలు ఆశ్చర్యపోయారు.

పాండురంగం కూతురికి కోతిబొమ్మ సింహంగా మారిపోయిందన్న నమ్మకం కుదిరింది. అదా బొమ్మతో ఇంకో అయిదు నిముషాలాడింది.

తర్వాత సింహం కుక్కగా మారింది. కుక్క పిల్లిగా మారింది. పిల్లి దేవకన్య అయింది. దేవకన్య రాక్షసుడు ....

పాండురంగం కూతురికి ఆట నచ్చింది. అది తండ్రి వద్ద మంత్రం నేర్చుకుని బొమ్మను రకరకాలుగా మార్చి రోజంతా ఆడుకునేది. అందువల్ల పాండురంగం భార్యకు పైమరు సదుపాయం పోయింది కానీ పిల్లకు కొత్తబొమ్మలు కొనే అవసరం తప్పింది. ఆ ఆదా చేసిన డబ్బుతో ఆమె పైమరు కొనుక్కుంది.

పాండురంగం కూతురు తనీడు పిల్లల్ని కూడగట్టుకుని బొమ్మల రూపురేఖలు మార్చే ఆట ఆడేది. ఆ ఆట పిల్లలందరికీ నచ్చింది. చాలా మంది దాని చుట్టూ చేరేవారు. మంత్రం చెప్పమని దాన్నందరూ అడిగేవారు. అది చెప్పనని మొరాయించేది. కొందరికి మంత్రం చెబుతానని వూరించి తన చుట్టూ తిప్పుకునేది. కానీ చెప్పేది కాదు.

అలాంటి మంత్రం గురించి చుట్టుపక్కల తలిదండ్రులపై పిల్లల ఒత్తిడి ప్రారంభమయింది. వాళ్ళు విషయం గ్రహించి ఏదో మంత్రం చెబితే అది పనిచేసినట్లు నలుగురూ ఒప్పుకునే వారు కాదు. మంత్రం ప్రభావం ప్రచారంలోనే కానీ మంత్రంలో లేదు కదా! ఈ రహస్యం ఆ పిల్లల తలిదండ్రులకు తెలియదు. అందుకని చివరకు వాళ్ళు తమ సమస్యను పాండురంగానికే చెప్పుకున్నారు.

అప్పుడు పాండురంగం ఆశ్చర్యపోయాడు. ప్రచారం ప్రభావం ఎంత గొప్పదో అర్థమయిందతడికి.

ఆ తర్వాతనే ప్రచారాన్ని సాహిత్యానికుపయోగించ సాగాడతడు.

దాంతో.....

రచయిత(త్రు)ల బొమ్మలు పత్రికలకు ముఖచిత్రాలయ్యాయి.

రచనలో ఏముందనికాక రచన చేయడానికి జరిగిన కృషికి ప్రచారం ఎక్కువయింది.

రచనలో భావ పుష్టి, వాతావరణాల ప్రాధాన్యత నశించి టెక్నికల్ ఇన్ఫర్మేషన్ ఇవ్వడం ముఖ్యమయింది.

ఒక్క మాటలో చెప్పాలంటే సాహిత్యం

దీపావళి శుభాకాంక్షలు

వాటర్ పైపులు

ఎలక్ట్రికల్ కాండ్యూట్స్




9537

ఫోన్స్: 76163
74846

రత్నా ప్లాస్టిక్స్

ఆల్కట్ గార్డెన్స్ - రాజమండ్రి

అంగడి సరుకయింది.

ఈ పద్ధతిలోనే చలపతి ప్రముఖ రచయిత అయ్యాడని చాలామంది నమ్మకం. అయితే పాండురంగం ఇలాంటి అవకాశాన్నెందరికో ఇచ్చాడు. చుక్కల మధ్య చంద్రుడిలా చలపతి మాత్రమే వారిలో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాడంటే అతడిలోనూ ఎంతో కొంత సామర్థ్యముండాలి కదా!

ఏది ఏమైనా చలపతి రచనలు తెలుగు సాహిత్యానికి ఇంగ్లీషు నవలంత గౌరవాన్ని తీసుకొచ్చాయనడంలో సందేహం లేదు.

అందుకే అతడికి సన్మానం తలపెట్టారభిమానులు.

రాష్ట్ర రాజధానిలో అంతకు ముందెన్నడూ కనివిని ఎరుగని విధంగా ఆ సన్మానసభ ఏర్పాటు చేయబడింది. దానికి ఎప్పుడో ఒకప్పుడు అంతో యింతో రాసిన ప్రతివాడికీ ఆహ్వానం వెళ్ళింది.

సన్మానసభలో వేదిక మీదకు వచ్చిన పాండురంగం, "నేను రచయితల ప్రతిభను వెలికితీయ డానికి కొత్త పుంతలు తొక్కాను. అవి తెలుగు సాహిత్యానికి మంచినే చేశాయని నాకు తెలుసు, మీకూ తెలుసు. అందుకే నా పత్రిక సర్క్యులేషను తారస్థాయికి చేరుకుంది. మిగతా పత్రికల వాళ్ళు నా పద్ధతుల్ని విరసిస్తున్నారు. అందుకు అసూయ మినహా వేరే కారణం లేదనడానికి నిదర్శనం ఒక్కటే! అన్ని పత్రికలూ ఇప్పుడు నా పద్ధతినే అనుసరిస్తున్నాయి" అన్నాడు.

అంతే!

కరతాళధ్వనులతో సభ దద్దరిల్లిపోయింది.

తర్వాత పలువురు అభిమానులు వేదిక మీదకు వచ్చి బరువైన దండలతో చలపతిని అలంకరించారు.

చలపతి సన్మానానికి కృతజ్ఞతలు పలికాడు. తెలుగు సాహిత్యంలో పేరెన్నికగన్న వారందరినీ పేరు పేరునా ప్రశంసించాడు. పాండురంగానికి ధన్యవాదాలర్పించాడు. ఉపన్యాసం ముగిస్తూ, "చలనచిత్రంలో దర్శకుడు, నటుడు కలిసి ఎలా పని చేస్తారో పత్రికాలోకంలో సంపాదకుడు, రచయిత అలా వుంటే కళాత్మక విలువలు ప్రజారంజకమవుతాయని పాండురంగం, నేనూ రుజువు చేశాం. సంపాదకుడుగా అతడు కొత్త పద్ధతులననుసరిస్తే రచనలకు నేను కొత్తవరవడి పెట్టాను. అందువల్లనే మా మా రంగాల్లో మేము నెంబర్ వన్ హోదాకు చేరుకోగలిగాం" అన్నాడు.

## ఆర్కిటైప్స్

నీ ఉద్వేగాల్లో, ఆలోచనల్లో
ప్రాచీనత, పాశవికత
నీలో యుగయుగాల జీవ ప్రవృత్తి
తరతరాల మానవ సంస్కృతి
నీ వెనుక నీడలు
నీ సామూహిక అచేతనలో
వారసత్వ ప్రతీకలు
నువ్వు స్త్రీవైతే నీ నీడ పురుషుడు
నువ్వు పురుషుడివైతే అది స్త్రీ
దేవుడనీ... దయ్యమనీ...
చావనీ... పుట్టుకనీ...
మంచనీ... చెడనీ...
ద్వంద్వాలలో పడి
మనుగడ సాగిస్తావు.
సమన్వయం కోసం
సంకేతాలు సృష్టిస్తావు
కలలు కంటావు
కథలు చెబుతావు
ఐక్యత కోసం అలమటిస్తావు

—పి.వి. కృష్ణారావు

* యూంగ్ సిద్ధాంతం

అయిదు నిముషాలసేపు ఆగకుండా చప్పట్లు మోగాయి.

ఆ సమయంలో సభలోంచీ ఒక వృద్ధుడు లేచాడు. ఆయనకు సుమారు ఎనభయ్యేళ్ళ వయసుండవచ్చు. మనిషి కాస్త వణుకుతున్నాడు.

ముందు ఆయన్నెవరూ పట్టించుకోలేదు.

ఆయన మెల్లిగా నడుస్తూ వేదిక మీదకు వచ్చాడు. అప్పుడందరి దృష్టీ ఆయన మీదకు మళ్ళింది.

ఉతికిన బట్టలు వేసుకున్నా మనిషి ఖరీదైన వాడిలా లేడు. గెడ్డం నున్నగా గీసుకున్నా మనిషి నీటుగా లేడు. జుత్తు తెల్లగా పండినా జ్ఞానిలా లేడు. మనిషి వృద్ధుడైనా ఆ వేదిక మీద అందరిలో గౌరవించతగ్గవాడిలా కనిపించడం లేదు.

సభికుల్లో కలకలం. వేదికపై కలవరం.

"చలపతి కంటె అర్థ శతాబ్దం పెద్దవాణ్ణి. అతడి నభినందిస్తూ నాలుగు ముక్కలు చెబుతాను" అన్నాడా వృద్ధుడు.

మనిషి వణుకుతున్నా మాట దృఢంగా వుంది.

సన్మాన సభలో ఊహించని ఈ మలుపు చాలామందిని ఆశ్చర్యంలో ముంచింది.

వయోవృద్ధుడు ఓటు వేసినా, అభినందించినా అదొక అద్భుత ప్రచారం. చలపతి, పాండురంగం ఈ విశేషానికి ఆనందపడితే సభకు వచ్చిన అసూయాపరులు ఇది ముందుగా చేసుకున్న ఏర్పాటుకానీ కాదుగదా అనుకున్నారు.

వృద్ధుడికి మాట్లాడే అనుమతి లభించింది.

"అయ్యలారా! నలభై ఏళ్ళ క్రితం నేనూ ఒక రచయితను. ఆంగ్లంలో వచ్చే క్రైం సాహిత్యం వల్ల ప్రభావితుణ్ణై ఎన్నో నవలలు రాశాను. అయితే అంటరానివాళ్ళను గుడిలోకి రానివ్వనట్లు నా నవలను పత్రికలు తాకడమే పాపంగా భావించేవి. వాటిని అయిదో పదికో పబ్లిషరు కమ్ముకుంటే వాళ్ళు పాకెట్ సైజు పుస్తకాలుగా అచ్చేసి అమ్ముకునేవారు. ఆ పుస్తకాలకు ఎంతో గిరాకీ వుండేది. వాటిని అందరూ చదివి ఆనందించేవారు. కానీ, అవి చదివామని చెప్పడం అగౌరవంగా భావించబడేది. అందులోని పాత్రలు సజీవాలై ప్రజల నోళ్ళలో నానుతున్నా ఆ పాత్రల సృష్టికర్తకు సాహితీ లోకంలో రచయితల మధ్య కూర్చునే అర్హత వుండేది కాదు. అందువల్ల ఎన్ని నవలలు రాసినా నాకు తృప్తి వుండేది కాదు. ఇప్పుడు మన చిరంజీవి చలపతి పెట్టిన కొత్తవరవడి ధర్మమా అని నా పాత పుస్తకాలకు విలువ వచ్చింది. ఎందరో పత్రికా సంపాదకులు వాటిని సీరియలైజ్ చేస్తామని నన్నడుగుతున్నారు. ఉన్నట్లుండి సాహితీపరుడిగా నాకు గుర్తింపు వచ్చింది. అంటరాని వారికి హరిజనులన్న పేరునిచ్చి కూడా జాతిపిత బాపూజీ సాధించలేకపోయిన ఘనకార్యాన్ని మన చిరంజీవి సాహిత్యం విషయంలో సాధించాడు. అతడి కొత్తవరవడికి నా కృతజ్ఞతలు!"

సభంతా నిశ్శబ్దం.

వేదికపై నిశ్శబ్దం.

అప్పుడు వేదిక మీదకు మరో వృద్ధుడు ఎక్కుతున్నాడు.

పచ్చి శృంగారాన్ని అసభ్యంగా చిత్రిస్తూ కథలుగా రాసి అచ్చువేసి అమ్ముకునేవాడని ఆ వృద్ధుడిపై యాభై ఏళ్ళ క్రితం అభియోగముండేది. అతడెవరో పాండురంగానికీ, చలపతికీ కూడా తెలుసు. అందుకేనేమో ఇద్దరూ కూడా ఏక కంఠంతో, "ఆయన్నాపండి!" అన్నారు.

పరవళ్ళు తొక్కే కొత్తవరవడిలోని కొత్తదనాన్ని నిలుపుకునేందుకు చేస్తున్న ఆక్రందనలా ధ్వనించిందప్పుడు వారి స్వరం!